సాక్షి
జనగామ

శుక్రవారం | 18 | ఏప్రిల్ | 2025



రజతోత్సవ సభకు ఏర్పాట్లు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలో సభ కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. - 10లో▸



నిరంతరం కష్టపడితేనే విజయం

నిరంతరం కష్టపడితేనే విజయం వరిస్తుందని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీ కాలేజీ వార్షిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేలో మాట్లాడారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/26^0$

వాతావరణం

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

నిలువ నీడ కరువు

- బస్సుకోసం ఎండలోనే నిరీక్షణ
- హోటళ్లు, చెట్లు, డివైడర్లే.. షెల్టర్లు
- స్టాప్ ఒకచోట.. బస్సాగేది మరోచోట
- నరకం చూస్తున్న ప్రయాణికులు

గ్రాండ్ రిపోర్ట్

జనగామ: కాలం ఏదైనా బస్సు ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. బస్‌షెల్టర్లు ఉండవు.. ఉన్నా అక్కడ బస్సులు ఆగవు. మండుటెండైనా.. కుంభవృష్టి వానైనా తలదాచుకోవడానికి నీడ లేని దయనీయ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. మండల కేంద్రాలు, హైవేలపై ఊర్లు, ప్రధాన బస్టాపుల వద్ద షెల్టర్ల నిర్మాణం లేక పోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, టాయిలెట్లు అందుబాటులో లేక నరకం చూడాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా బస్సు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి' గురువారం పరిశీలించింది.



డివైడర్‌పై కూర్చుని బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

స్టేషన్‌ఘన్‌పూర్: పై ఫొటోలో కనిపిస్తున్న బస్‌షెల్టర్ వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారి స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధి ఛాగల్ గ్రామం వద్ద ఉంది. స్థానిక ప్రజలు ఇక్కడి నుంచి నిత్యం హనుమకొండ, జనగామ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వెళ్తుంటారు. గ్రామంలో బస్‌షెల్టర్ లేదు. పైగా నిలబడటానికి నీడ కూడా లేదు. మండు టెండలో రోడ్డు, డివైడర్‌పై కూర్చుని బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి



జాతీయ రహదారిపై రాఘవపూర్, ఛాగల్ స్టేజీల వద్ద బస్‌షెల్టర్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండుతున్న ఎండలతో నరకం చూడాల్సి వస్తోంది. డివైడర్లపై కూర్చున్న సమయంలో రోడ్డు ప్రమాద ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి.

\- కందుకూరి లక్ష్మీనారాయణ, ఛాగల్

నీడ లేక రోడ్డు పక్కన కల్వర్టుపై ప్రయాణికులు



చెట్లకింద సేదదీరాల్సిందే..

కొడకండ్ల: మొండ్రాయి క్రాస్‌రోడ్(చింతల్ బస్‌స్టాప్) సమీపంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, బోడోనికుంట, పెద్దబాయి, మొండ్రాయి పరిసర తండాలకు చెందిన ప్రయాణికులు నిత్యం మండల కేంద్రంతో పాటు జనగామ, తిరుమలగిరి, పాలకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. బస్‌షెల్టర్ లేక చెట్ల కింద సేద దీరాల్సిన దుస్థితి. సంవత్సరాల తరబడి సమస్య ఉన్నా పట్టించుకున్న వారే లేరు.

జఫర్‌గఢ్‌లో చెట్లకింద నిలబడి బస్సుకోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



పండ్లబండ్లు.. హోటళ్ల వద్ద నిరీక్షణ

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో ప్రధాన రహదారికి కొద్ది దూరంలో బస్టాండ్ నిర్మించారు. అది శిథిలావస్థకు చేరింది. బస్సులు అక్కడికి వెళ్లక పోవడంతో ప్రయాణికులు రోడ్డు పక్కన పండ్ల బండ్లు, హోటళ్లు, చెట్ల కింద నిరీక్షించాల్సిన వస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్, హనుమకొండ, వర్ధన్నపేట తదితర ప్రాంతాలకు వెళ్లేవారు గాంధీ, అంబేడ్కర్ సెంటర్లలోని రోడ్డు పక్కన గంటల తరబడి నిరీక్షించాల్సిందే. ఇక్కడ కనీసం నిలువ నీడ లేదు. అంబేడ్కర్ సెంటర్‌లోని బస్‌షెల్టర్‌ను కూల్చివేశారు. తిరిగి నిర్మాణం చేపట్టలేదు.

అవస్థలు పడుతున్నం..



బస్సు కోసం ఎదురు చూసే తరుణంలో ఎండలకు తట్టుకోలేక అవస్థలు పడుతున్నం. వర్షం పడిన సందర్భంలోనూ ఇబ్బందులే. ఇక్కడ టాయిలెట్లు కూడా అందుబాటులో లేవు. బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలి.

\- ఎండీ.అఫ్జల్, కేశ్వాపూర్, జఫర్‌గఢ్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..



నేషనల్ హైవేపై బస్సుకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

చిల్పూరు : నాలుగు మండలాలకు ప్రధాన కూడలి చిన్న పెండ్యాల. తెల్లవారింది మొదలు రాత్రి 8 గంటల వరకు ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్సు కోసం ఎదురు చూసే సమయంలో షెల్టర్ లేక.. డివైడర్ పక్కనే నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. హైవే కావడంతో వాహనాలు దూసుకొస్తూ ఉంటాయి. ప్రమాదమని తెలిసినా నిలబడటానికి ఎక్కడా చోటు లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సిందే.

వేచి ఉండాలంటే నరకమే..



బస్సు కోసం వేచి ఉండాలంటే నరకమే. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా, ఎండ కాసినా, వాన కురిసినా ఇబ్బంది కలుగకుండా బస్‌స్టాప్ నిర్మాణం చేయాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి.

\- తాళ్లపల్లి క్రాంతికుమార్, ప్రయాణికుడు



సౌకర్యాలు లేని దేవరుప్పల బస్‌షెల్టర్

నలుగురు కూర్చుంటే నిండి పోతుంది

దేవరుప్పుల : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌లో నలుగురు కూర్చుంటే నిండి పోతుంది. చౌరస్తాకు అతి సమీపంలో ఉన్న ఈ బస్‌షెల్టర్‌ను నిరుపయోగంగా మార్చేశారు. మధ్యాహ్నం దాటిందంటే ఎండంతా షెల్టర్‌లోకే వస్తుంది. తాగునీటి సదుపాయం కల్పించలేదు. అరకొర సదుపా యాలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.



జనగామ నెహ్రూపార్కు వద్ద బస్‌షెల్టర్ లేక ఎండలో నిరీక్షిస్తున్న విద్యార్థులు

పుణ్యక్షేత్రంలో బస్‌షెల్టర్‌కు దిక్కులేదు

పాలకుర్తి టౌన్ : జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తూ ఉంటారు. సమీపంలో బస్‌షెల్టర్ లేదు. కనీసం నీడ కూడా కనిపించదు. భక్తులు గుడికి సంబంధించిన ఆర్చి వద్ద ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. గుడివాడ చౌరస్తా పంచగుడి వద్ద కూడా బస్‌షెల్టర్ లేక ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు.



టెంపుల్ ఆర్చి వద్ద ఎండలో నిరీక్షిస్తున్న భక్తులు

తొలగించారు.. మళ్లీ నిర్మించలేదు

రఘునాథపల్లి : నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో నిడిగొండ వద్ద ఆర్టీసీ బస్ షెల్టర్‌ను కూల్చి వేశారు. తిరిగి నిర్మాణం చేపట్టక పోవడంతో హైవే పైనే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బస్‌షెల్టర్ లేక ప్రాణాలు అరచేత పట్టుకుని గడపాల్సి వస్తోంది.



ఎండలో డివైడర్‌పై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించడంతోపాటు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



లింగాలఘణపురం: దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ నల్గొండ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్ అన్నారు. గురువారం జీడికల్ వీరాచల శ్రీరామచంద్రస్వామి ఆలయంలో జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన దేవాలయాల ఈఓలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల పేర్లతో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈఓలు లక్ష్మీప్రసన్న, వంశీ పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌కు సెలవు

జనగామ: గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు నేడు (శుక్రవారం) సెలవు ప్రకటించినట్లు చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడానికి మార్కెట్‌కు తీసుకురావొద్దని సూచించారు. 19న మార్కెట్ సేవలు కొనసాగుతాయని తెలిపారు.

24న ఉచిత విద్య టాలెంట్ టెస్ట్

జనగామ రూరల్: నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య లక్ష్యంతో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 24న జిల్లా కేంద్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, వెంకటేష్ తెలిపారు. గురువారం పట్టణంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతిభా వంతులైన గ్రామీణ పేద విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా ఉచిత విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 4,5,6 తరగతులు చదివే వారికి అర్హత పరీక్ష ద్వారా 5,6,7 తరగతుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. డిగ్రీ, ఆపై విద్య వరకు ఉచిత హాస్టల్ ప్రవేశంతో కూడిన విద్య అందించనున్నట్లు వివరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రఘునాథపల్లి: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్ అన్నారు. గురువారం నిడిగొండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్.జయలక్ష్మి, వీరలక్ష్మి, అంజనీబాయి, శోభ పాల్గొన్నారు. అలాగే శ్రీమన్నారాయణపురం, భాంజీపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా ఆకలి పరీక్ష నిర్వహించారు.

'భూ భారతి'తో రైతులకు న్యాయం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని తెచ్చింది.. దీని ద్వారా రైతులకు సరైన న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆర్డీఓ వెంకన్న అధ్యక్షతన భూ భారతి ఆర్ఓఆర్–2025 చట్టంపై కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయని, అర్హులైన రైతులు నష్టపోగా పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని అన్నారు. ధరణి ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు పెట్టాలని అన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఈ చట్టంతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ చీకటి వినీత్, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య, ఎంపీఓ మధుసూదన్, వ్యవసాయాధికారి నజీరుద్దీన్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడియం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రఘునాథపల్లి: మండల పరిధిలోని లక్ష్మీతండా, ఇబ్రహీంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు ఫతేషాపూర్ నుంచి రామచంద్రగూడెం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, ఇబ్రహీంపూర్‌లో పునరుద్ధరించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, ఆర్‌డీఓ గోపిరాం, తహసీల్దార్ ఎండీ.మోహిస్సా న్‌ముజ్జబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం సారయ్య, కోళ్ల రవిగౌడ్, నామాల బుచ్చయ్య, మల్కపురం లక్ష్మయ్య, మాలోతు నర్సింహ, పయ్యావుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: ప్రభుత్వ పథకాల అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ, పింఛన్లు, కుక్కకాటు నివారణ తదితర అంశాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో ఇందిరమ్మ, వార్డు కమిటీల ద్వారా ఈనెల 18 నుంచి 21 వరకు ఎంపీడీఓలకు వచ్చే జాబితా ప్రకారంగా లబ్ధిదారులను గుర్తించాలని చెప్పారు. 22 నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వేచేసి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. మే 2న జీపీ కార్యాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించడంతోపాటు మే 3 నుంచి 5 వరకు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాక అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపీడీఓలు మండల స్థాయిలో బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న శాశ్వత వలస పింఛన్లు, మరణించిన పింఛన్‌దారుల పరిశీలన వేగంగా చేపట్టాలని తెలిపారు. తాగునీటి వనరులు లేని గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తుదారుల భూముల పరిశీలన వేగంగా చేపట్టాలని, అభ్యంతరాలు లేని వాటికి ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆదేశించారు. వీధి కుక్కల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, ఆర్డీఓలు గోపిరాం, వెంకన్న, మున్సిపల్ కమిషనర్‌లు వెంకటేశ్వర్లు, రవీందర్, డీపీఓ స్వరూపరాణి, డిప్యూటీ సీఈఓ సరిత, ఎల్డీఎం శ్రీధర్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మాధవిలత, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి..

మహనీయులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిబాపూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ రిజ్వానా బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యాన పార్నంది వెంకటస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు డాక్టర్ విక్రమ్ కుమార్, మాధవిలత, రవీందర్, వెంకటేశ్వర్లు, పులి శేఖర్, డాక్టర్లు సీహెచ్.రాజమౌళి, సుగుణాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకుంటలో పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

'కుంట' అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం బతుకమ్మ కుంటను సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మకుంటను మరింత అభివృద్ధి చేయడానికి రూ.కోటి 50 లక్షలు మంజూరయ్యాయని, సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, కాలిబాట, లైటింగ్, వ్యాయామ పరికరాలు, చిన్నారులకు ఆటస్థలం, పరికరాలు, మినీ పార్కు పనులు నెలరోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కుంట పూడికతీత పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, ఏఈ మహిపాల్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కారు కిరాయి.. ఇంధనం పరాయి

- స్కాన్ చేసినట్లు యాక్షన్.. ఇంధనం క్యాన్లతో పరార్
- పెట్రోల్ బంకులకు బురిడీ కొట్టించి జల్సా
- మూడు బృందాలుగా ఆగడాలు.. పోలీసుల అదుపులో ఆకతాయిలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

పరకాలలోని హుజూరాబాద్ రోడ్డున ఉన్న ఓ పెట్రోల్ బంకుకు గత నెల 25న స్కైబ్లూ కలర్ కియా కారులో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. క్యాన్లలో రూ.7,500 (78.67 లీటర్ల) డీజిల్ పోయించుకున్నారు. డబ్బులు ఇమ్మని అడగ్గా ఫోన్‌పే చేస్తామని స్కాన్ చేశారు. డబ్బులు రాలేదని చెప్పగా.. వస్తాయని చెప్పి కారులో ఉడాయించారు. దీంతో పెట్రోల్ బంక్ మేనేజర్ ఈనెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయపర్తిలో హెచ్‌పీ పెట్రోల్ బంకులోకి గత నెల 31న రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో బ్లూ కలర్ బెలెనో కారు వెళ్లింది. అందులోని ముగ్గురు వ్యక్తులు మూడు క్యాన్లలో రూ.10,508 విలువైన 110.22 లీటర్ల డీజిల్ పోయించుకున్నారు. స్కానర్ ద్వారా పేమెంట్ చేసినట్లు చెప్పారు. డబ్బులు జమ కాలేదని చెప్పినా వినకుండా కారు స్టార్ట్ చేసుకుని వెళ్లారు. దీంతో ఆ బంకు క్యాషియర్ ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పరకాలలోని పెట్రోల్ బంక్‌లో కియా కారులో క్యాన్లు పెట్టి డీజిల్ పోయించుకుంటున్న దుండగులు (సీసీ టీవీ ఫుటేజీ)

... ఇలా సుమారు 25 రోజుల్లో సుమారు 25 బంకుల్లో డీజిల్, పెట్రోల్ దొంగిలించిన ఆకతాయిల వ్యవహారం వరంగల్ కమిషనరేట్ పోలీసులకు సవాల్‌గా మారింది. గత కొద్ది రోజులుగా ఆకతాయిలు కొందరు సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాలను అద్దెకు తీసుకుని కారుతోపాటు క్యాన్‌లలో ఇంధనం తీసుకెళ్లి అమ్ముకుంటూ.. ఆ డబ్బుతో జల్సా చేయడం పరిపాటిగా మారింది. అత్యధికంగా పరకాల, దామెర, నడికూడ, రాయపర్తి, జఫర్‌గఢ్, రేగొండ, నల్లబెల్లి మండలాల్లోని బంకుల్లో ఈ తరహా దందాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పరకాల, రాయపర్తి పోలీసులు నిందితుల కోసం ఆరా తీయగా.. ఇంధనం దొంగల గుట్టురట్టయ్యింది. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సుమారు 12 మంది వరకు పనీపాట లేని యువకులు మూడు టీములుగా ఏర్పడి 'సెల్ఫ్ డ్రైవింగ్' వాహనాలకు అద్దెకు తీసుకుని ఆ వాహనాల నంబర్ ప్లేట్లు తీసి పెట్రోల్ బంకుల్లో వెళ్లి ఇంధనం దొంగిలిస్తూ జల్సాలు చేస్తుండగా పోలీసులు వారి ఆట కట్టించినట్లు సమాచారం. మూడు టీములకు చెందిన సభ్యులను అరెస్టు చేసేందుకు సిద్ధమైన పోలీసులు అదుపులో ఉన్నవారినుంచి పూర్తి వివరాలు రాబడుతున్నట్లు సమాచారం. కాగా నేడో, రేపో నిందితులను అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

శిశువు మృతి ఘటనపై విచారణ

- ఇద్దరు వైద్యుల సస్పెన్షన్
- పలువురికి మెమోలు జారీ

పాలకుర్తి టౌన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీకి వచ్చిన గర్భిణి కడుపులో శిశువు మృతి చెందిన ఘటనపై కలెక్టర్ ఆదేశాలతో డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు గురువారం విచారణ చేపట్టారు. గర్భిణి ఎప్పుడు ఆస్పత్రిలో చేరింది. ఆమెకు చేసిన పరీక్షలు ఏమిటి. ఇచ్చిన మందుల వివరాలతోపాటు ఆ సమయంలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది సమాచారం తెలుసుకున్నారు. అలాగే గర్భిణిని జనగామ ఎంసీహెచ్‌కు ఎందుకు రెఫర్ చేయలేదు.. చేస్తే వారు వెళ్లలేదా.. ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఎవరు సూచించారు.. బాధిత కుటుంబ సభ్యులు వెల్లడించిన అంశాలపై విచారణ చేపట్టారు. అలాగే ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విచారణలో అడిషనల్ డీఎంహెచ్ఓ రవీందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్, డాక్టర్ సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తి ఆస్పత్రిలో విచారణ నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు

వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం

పలు కోణాల్లో విచారణ చేపట్టిన డీఎంహెచ్ఓ ఈ ఘటనకు వైద్యులతో పాటు ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తేల్చారు. బాధ్యులైన గైనకాలజిస్ట్ డాక్టర్ కె.అపర్ణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజులుగా విధులకు రాకుండా పర్యవేక్షణ లోపానికి కారణమైన సూపరింటెండెంట్ డాక్టర్ పరమేశ్వరిని సస్పెండ్ చేయడానికి కమిషనర్ వైద్య విధాన పరిషత్‌కు రెకమండ్ చేశారు. అలాగే ఆస్పత్రికి వచ్చిన గర్భిణి అర్చన విషయంలో అమర్యాదగా వ్యవహరించిన స్టాఫ్‌నర్సు జె.నీల, ఎంపీహెచ్ఏ కృష్ణవేణిలకు మెమో జారీ చేశారు. కొద్దిరోజులుగా విధులకు గైరాజరవుతున్న జీడీఎంఓ భరత్‌ను విధుల నుంచి తొలగించారు. గర్భిణిని సకాలంలో ఉన్నత ఆస్పత్రికి రెఫర్ చేయడంలో నిర్లక్ష్యం వహించి డాక్టర్ స్వప్నకు సైతం మెమో జారీ చేశారు.

క్లుప్తంగా

వడదెబ్బతో కూలీ మృతి


వెంకటేశ్వర్లు(ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 1వ వార్డుకు చెందిన వ్యవసాయ కూలీ పలిశెట్టి వెంకటేశ్వర్లు (62) వడదెబ్బతో మృతి చెందినట్లు అతడి భార్య రమణ తెలిపారు. వెంకటేశ్వర్లు రోజూ సమీపంలోని పంట పొలాలు, మిర్చి కల్లాల వద్దకు పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం కూడా వెళ్లాడు. రాత్రి వాంతులు, విరోచనాలు జరిగి ఇంటి వద్దే మృతి చెందినట్లు ఆమె తెలిపారు.

19 నుంచి బునియాడీ కార్యకర్తల సమ్మేళనం


రవీందర్ నాయక్

హన్మకొండ: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే బునియాడీ కార్యకర్తల సమ్మేళనం విజయవంతం చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ఆదేశాల మేరకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ డెలిగేట్లు పాల్గొంటారని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతీ మండలం నుంచి ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తలు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వరంగల్: మూడేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.షుకూర్ తెలిపారు. బుధవారం రాత్రి గిర్మాజీపేటలో కిరాయికి ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన మూడేళ్ల చిన్నారి తన నానమ్మ వద్ద అన్నం తిని ఇంటి ఆవరణలో అన్నయ్యతో ఆడుకుంటోంది. వీరు ఉంటున్న ఇంట్లోనే పైఅంతస్తులో కిరాయికి ఉంటూ పెయింటింగ్ వర్క్ చేసే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లల్లు రంజాన్.. ఇద్దరు పిల్లలను బయటకు తీసుకెళ్లి బిస్కెట్‌లు కొనిచ్చాడు. ఇంటికి తీసుకొచ్చి బాలికలను పైఅంతస్తులోని తన గదికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాలిక తన నానమ్మతో చెప్పగా కుటుంబ సభ్యులు రంజాన్‌ను నిలదీయగా పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రంజాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

రజతోత్సవ సభకు చకచకా ఏర్పాట్లు

ఎల్కతుర్తిలో భారీ సభ కోసం మొత్తం 1,159 ఎకరాలు

- పార్కింగ్ స్థలాలు, సభావేదిక మైదానాల చదును
- పాతికేళ్ల వేడుకల సభకు మరో పది రోజులే... రోడ్డెక్కిన ప్రచార రథాలు
- ఆవిర్భావ సభ సక్సెస్‌కు నేడో, రేపో కీలక కమిటీలు
- ఏర్పాట్లపై రోజు రెండుసార్లు అధినేత కేసీఆర్ ఆరా
- ఉమ్మడి వరంగల్ నేతలతో రేపు కేసీఆర్ భేటీ...?


ఎల్కతుర్తి సమీపం చింతలపల్లి శివారులో సభావేదిక స్థలం, జెండాలు, బారికేడ్లతో ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, వరంగల్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పాతికేళ్ల పండుగ వేడుకలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) అవతరించి 25 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఈ రజతోత్సవ వేడుకలను నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపం చింతలపల్లి శివారులో ఈ నెల 27న భారీ సభ నిర్వహిస్తోంది. పది లక్షల మందికి తగ్గకుండా జనసమీకరణ చేసి 'పబ్లిక్ మీటింగ్' నిర్వహించడానికి మార్చి 28న కాజీపేట ఏసీపీకి అనుమతి కోసం దరఖాస్తు చేశారు. అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరగడంతో బీఆర్‌ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 12న పోలీసుల అనుమతి కూడా లభించింది. పాతికేళ్ల పండుగ వేడుకల నిర్వహణకు ఇంకా పది రోజులే ఉండటంతో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఏం జరుగుతోంది, పనులు ఎంతవరకు.. ఆరా తీస్తున్న అధినేత కేసీఆర్..

రజతోత్సవ వేడుకల సభ ఏర్పాట్లపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోజూ ఆరా తీస్తున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. సభావేదిక ఏర్పాట్ల కోసం మొదట మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించగా.. ప్రస్తుతం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, ఉమ్మడి జిల్లా నేతలు పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం ఓసారి, సాయంత్రానికోసారి సభావేదిక ఏర్పాట్లపై కేసీఆర్ ఆరా తీస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, బావుపేట, ఎల్లాపూర్, కొత్తపల్లి శివార్లలో వాహనాల పార్కింగ్ కోసం స్థలాల చదును పూర్తయ్యింది. సుమారు 50 వేల వాహనాల వరకు వస్తాయని అంచనా వేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు.. ఆ మేరకు ఇంకా పార్కింగ్ స్థలాలను పెంచుతున్నారు. ఇదిలా ఉండగా జనసమీకరణకు ఇదివరకే ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఓ వైపు సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే.. మరోవైపు జన సమీకరణ కోసం నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసేందుకు 'ప్రచార రథం'లు కూడా రోడ్డెక్కాయి. కాగా, సభకు మరో పది రోజులే గడువు ఉండటంతో రెండు రోజుల్లో కీలక కమిటీలు వేయడంతోపాటు శనివారం ఉమ్మడి వరంగల్ నాయకులతో కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

సమావేశ స్థలం కంటే పార్కింగ్‌కే అధికం..

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పాతికేళ్ల పండుగ వేడుకల కోసం ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, గోపాల్‌పూర్ శివార్లలో 1,159 ఎకరాల భూసేకరణ చేశారు. ఇందుకోసం రైతులు స్వచ్ఛందంగా అనుమతి పత్రాలు ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. పోలీసులకు అనుమతి కోసం చేసిన వినతిపత్రంలో సమావేశానికి 159 ఎకరాలు, పార్కింగ్ కోసం 1000 ఎకరాలు సేకరించినట్లు స్పష్టం చేశారు. వరంగల్ – కరీంనగర్, సిద్దిపేట – వరంగల్, యాదాద్రి భువనగిరి – ఆరెపల్లి (భూపాలపట్నం)... మూడు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న ఎల్కతుర్తి, దాని పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న చింతలపల్లి శివారులో సభావేదిక, సమావేశానికి హాజరయ్యే ప్రజల కోసం కుర్చీలు, షామియానాలను వేసేందుకు భూమి చదును పనులు పూర్తి దశకు చేరుకుంటున్నాయి. లక్షల్లో జనం హాజరయ్యే అవకాశం ఉన్నందున నిఘా కోసం తగినన్ని సీసీ కెమెరాలు, పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా మ్యాపింగ్ చేస్తున్నారు.

నిరంతరం కష్టపడితేనే విజయం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : నిరంతరం కష్టపడితేనే విజయం వరిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో గురువారం యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన యూనివర్సిటీ కాలేజీ వార్షిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేలో వీసీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కష్టించే తత్వం, పట్టుదల, అకడమిక్‌పై పట్టు, పెద్ద లక్ష్యం, జీవన నైపుణ్యాలు విజయమార్గాన్ని సుగమం చేస్తాయన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థి దశలో అవసరమన్నారు. గౌరవ అతిథి, ప్రముఖ సినీ గేయ రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ విద్యార్థులతోనే సమాజ మార్పు సాధ్యమన్నారు. రైతులు, తల్లిదండ్రులు, గురువుల పట్ల కృతజ్ఞతభావం ఉండాలన్నారు. మరో గౌరవ అతిథి, ఇండియన్ కబడ్డీ టీం పూర్వపు హెడ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చదువుకు టాలెంట్‌కు సంబంధం లేదు అన్నారు. చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బి. సురేశ్ లాల్, ఎన్. సుదర్శన్, బి. రమ, బి. సుకుమారి, ఎం.నవీన్, చిత్రరాజు, కె. అనితారెడ్డి, పుల్లూరి సుధాకర్, కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, క్యాంపస్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ మమత వందన సమర్పణ గావించారు.

బాలుడి వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా చర్యలు

- సీడీపీఓ శిరీష


అంగన్‌వాడీ టీచర్ సరిత, ఆయా భద్రమ్మను విచారిస్తున్న సీడీపీఓ శిరీష

మహబూబాబాద్: బాలుడి కాలుపై వాత పెట్టిన విషయంలో వైద్య పరీక్షలు నిర్వహించామని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని సీడీపీఓ శిరీష పేర్కొన్నారు. జిల్లా కేంద్రం సిగ్నల్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా భద్రమ్మ కత్తిని స్టౌవ్‌పై వేడి చేసి మనుదీప్(ఐదేళ్లు) అనే బాలుడి కాలుపై వాత పెట్టిన ఘటపై ఈనెల 16న కేంద్రం ఎదుట తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై సీడీపీ శిరీష, సూపర్ వైజర్ కవిత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ శిరీష మాట్లాడుతూ గత శనివారం బాలుడి నానమ్మ ఫోన్ చేసి గత గురువారం ఆయా భద్రమ్మ కత్తితో తన మనుమడి కాలుపై వాత పెట్టిందని ఫోన్‌లో తెలిపారన్నారు. వెంటనే ఆ కేంద్రం సందర్శించి ఘటన వివరాలు తెలుసుకోవాలని సూపర్ వైజర్ కవితను ఆదేశించామన్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్ సరిత ఈనెల 14,15న సెలవులో ఉండడంతో విచారణ పూర్తి కాలేదన్నారు. దీంతో ఈనెల 16న, 17న విచారణ చేశామన్నారు. ఆ బాలుడిని వైద్యపరీక్షల కోసం జిల్లా ప్రధాన వైద్యశాలకు పంపామన్నారు. దీనిపై త్వరలో రిపోర్ట్ ఇస్తామని చెప్పారన్నారు. వైద్యులు రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో వాత అని తేలితే చర్యలు తప్పవన్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- నిర్వాహకురాలు, ముగ్గురు విటుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ


ముఠా వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్సై అరుణ్

నర్సంపేట రూరల్ : వ్యభిచార ముఠా గుట్టు రట్టు అయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై దాడిచేసి నిర్వాహకురాలితోపాటు ముగ్గురు విటులను అరెస్ట్ చేసి ఇద్దరు మహిళలను కాపాడినట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కథనం ప్రకారం.. నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డులో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురు విటులు నర్సంపేటకు చెందిన కేసనపల్లి విక్రమ్, బానోజీపేటకు చెందిన కొయ్యల రమేశ్, కొయ్యల నితిన్, గృహ నిర్వాహకురాలు మాధన్నపేట రోడ్డులోని సీపీఐ కాలనీ చెందిన కన్నెరపు ఉమ పట్టుబడ్డారు. దీంతో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ. 2,750 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, నర్సంపేట ఎస్సై అరుణ్, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వరి, కానిస్టేబుళ్లు కృష్ణ, రాజు, నరేశ్, గణేశ్ పాల్గొన్నారు.

20 నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 20నుంచి 26వతేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ డి వాసంతి, ఉమ్మడి వరంగల్‌జిల్లా కోఆర్డినేటర్ ఎ. సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.అయితే పరకాలలోని జిల్లా పరిషత్ (బాలుర) హైస్కూల్ పరీక్ష కేంద్రానికి అనుబంధంగా ఆ పరీక్ష కేంద్రానికి దగ్గరలోనే ఎస్‌ఆర్ స్కూల్‌లో కూడా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పరకాల జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్ 2412130037 నుంచి 2412130187 వరకు గల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సింటుందని తెలిపారు. పరకాలలోని ఎస్‌ఆర్ స్కూల్ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ 2412130188 నుంచి 2412130380వరకు గల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఆయా విద్యార్థులు ఒకరోజు ముందుగా పరీక్ష కేంద్రానికి వెళ్లి నిర్ధారించుకోవాలని వారు సూచించారు.

20న అండర్-7 జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–07 చదరంగ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌ఎంఆర్ హైస్కూల్‌లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు జనవరి01, 2018, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను మే నెలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నమ్మించి కడతేర్చారు..

- పథకం ప్రకారం ఫోన్ చేసి రప్పించి హతమార్చారు
- కొమ్మాలు హత్య కేసులో దంపతుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయిరమణ, ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి: ఇంటి అవసరాల కోసం అప్పు ఇప్పించాడు. ఇది ఆసరా చేసుకుని అప్పు తీసుకున్న వ్యక్తి భార్యను శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన భర్త పరువు పోయిందని భావించి భార్యను నిలదీశాడు. దీంతో తాము కలిసి ఉండాని నిర్ణయించుకుని లొంగదీసుకున్న వ్యక్తిని పథకం ప్రకారం భార్యాభర్తలు హత్యచేశారు. నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లిలో ఈ నెల 12వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం నర్సంపేటలోని దుగ్గొండి సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ సాయిరమణ.. ఎస్సై గోవర్ధన్‌తో కలిసి హత్య వివరాలు వెల్లడించారు. ఐదేళ్ల క్రితం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన బానోత్ జంపయ్య 23 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఈక్రమంలో బానోత్ కొమ్మాలు(40) మధ్యవర్తిగా ఉండి రెండుసార్లు రూ.1.50 లక్షలు జంపయ్యకు అప్పుగా ఇప్పించాడు. ఇది ఆసరా చేసుకుని జంపయ్య భార్య విజయను కొమ్మాలు శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జంపయ్య పెద్ద మనుషులను ఆశ్రయించగా కొమ్మాలుకు రూ.70 వేలు జరిమానా విధించారు. ఈ క్రమంలో కొమ్మాలు వ్యవహారశైలితో తన పరువు పోయిందని భావించిన జంపయ్య.. కొమ్మాలును చంపాలని అనుకున్నాడు. కాగా, జంపయ్య తన భార్య విజయతో గొడవపడ్డాడు. కొమ్మాలును అయినా, నిన్ను అయినా చంపుతానని చెప్పాడు. దీంతో భయపడిన విజయ మనం కలిసే ఉందామని భర్తకు తెలిపింది. అనంతరం కొమ్మాలును హత్య చేయాలని ఇద్దరు నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కొమ్మాలు ఫోన్ చేసిన ప్రతీసారి అతడితో మాట్లాడడానికి వెళ్లమని జంపయ్య తన భార్య విజయకు చెప్పాడు. దీంతో విజయ పూర్తిగా కొమ్మాలును నమ్మించింది. ఈ క్రమలో పథకం ప్రకారం ఈ నెల 12న విజయ.. కొమ్మాలుకు ఫోన్ చేసి మాట్లాడాలి మొక్కజొన్న చేనువద్దకు రావాలని కోరింది. అనంతరం దంపతులు పథకం ప్రకారం కత్తులు తీసుకుని మొక్కజొన్న చేనులోకి వెళ్లారు. జంపయ్య ఎవరికీ కనిపించకుండా మొక్కజొన్న చేనులో కొంతదూరంగా ఉన్నాడు. ఈ విషయం గమనించకుండా కొమ్మాలు మొక్కజొన్న చేనువద్దకు చేరుకున్నాడు. ఇదే అదునుగా భావించి జంపయ్య వెనుకవైపు నుంచి కొమ్మాలును కత్తితో పలుమార్లు పొడిచాడు. అనంతరం దంపతులిద్దరు పరారయ్యారు. ఈ క్రమంలో రుద్రగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, హత్య కేసు ఛేదనలో ప్రతిభకనబర్చిన ఎస్సై గోవర్ధన్, సిబ్బందిని సీఐ అభినందించారు.

దక్కన్ క్వీన్ అందాలు జిగేల్..


విద్యుత్ కాంతులతో మెరుస్తున్న దక్కన్‌క్వీన్

వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా ముస్తాబు

- పెయింటింగ్, లైటింగ్స్‌తో కలర్‌ఫుల్‌గా స్టీమ్‌లోకో..
- ప్రొజెక్టర్ ద్వారా రైల్వే చరిత్ర ప్రదర్శన

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ఎదుట రైల్వే చరిత్ర తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన మొదటి తరం రైల్వే స్టీమ్ లోకోమోటివ్‌ను (కాజీపేట జంక్షన్ ఎదుట ఏర్పాటు చేసినప్పుడు లోకోకు చేసిన నామకరణం హెరిటేజ్ దక్కన్ క్వీన్) రైల్వే అధికారులు గురువారం సుందరీకరించారు. శుక్రవారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా డీజిల్‌లోకోషెడ్ సీనియర్ డీఎంఈ ఎస్.వి.వెంకటకుమార్, డీఎంఈ అనికేత్ కాడే పర్యవేక్షణలో 15 మంది రైల్వే సిబ్బంది పెయింటింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి స్టీమ్ లోకోను సుందరంగా అలంకరించినట్లు ఏఆర్‌టీ ఎస్ ఎస్ఈ పి.చంద్రశేఖర్ తెలిపారు. స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రొజెక్టర్ ద్వారా భారతీయ రైల్వే చరిత్ర, స్టీమ్ లోకోమోటివ్ విశేషాలను ప్రదర్శించగా ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. కాగా, విద్యుత్ కాంతుల మధ్య దక్కన్ క్వీన్ జిగేల్ మంటోంది. దీంతో ప్రయాణికులు ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. దక్కన్‌క్వీన్ కొత్త అందాలతో కాజీపేట జంక్షన్ శోభాయమానంగా మారింది.

మిర్చి కొనుగోళ్ల వివరాలు సేకరణ


మార్కెట్ కార్యదర్శితో మాట్లాడుతున్న జీఎస్టీ అధికారులు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు చేసిన కమీషన్ వ్యాపారుల వివరాలను జీఎస్టీ అధికారులు సేకరిస్తున్నారు. గురువారం జీఎస్టీ అధికారులు శ్రీధర్, గోపి మార్కెట్ కార్యాలయానికి వచ్చి కార్యదర్శి జి.రెడ్డితో భేటీ అయ్యారు. మార్కెట్ ఫీజులు చెల్లించిన వ్యాపారులు జీఎస్టీ చెల్లించకపోవడం, ఏమేరకు సరుకులు ఖరీదు చేశారన్న వివరాలు తెలియకపోవడంతో అధికారులు కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. వ్యాపారులు తాము కొనుగోలు చేసిన సరుకులకు ఒక శాతం మార్కెట్ ఫీజులు చెల్లించారు. ఈ ప్రకారం వ్యాపారులు తాము విక్రయించిన సరుకులకు 5శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ వివరాలు అందిన వెంటనే సదరు వ్యాపారులకు జీఎస్టీ అధికారులు నోటీసులు జారీ చేస్తారని తెలిసింది.

ఎల్‌సీ యాప్‌తో ప్రమాదాల నివారణ

- టీజీఎన్పీడీసీఎల్ వరంగల్ ఎస్‌ఈ కె.గౌతం రెడ్డి


ఎల్‌సీ యాప్ అమలును ప్రారంభించి సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వరంగల్ ఎస్‌ఈ కె.గౌతం రెడ్డి, డీఈలు

హన్మకొండ: ప్రమాదాల నివారణ, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఎల్‌సీ యాప్‌ను రూపొందించిందని కంపెనీ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతం రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ఆజంజాహి మిల్ సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ యాప్‌ను ప్రారంభించి అమలు చేశారు. విద్యుత్ సంబంధ మరమ్మతులు చేస్తున్న క్రమంలో లైన్ క్లియర్ తీసుకుంటామని, ఒక్కోసారి సమాచార లోపంతో ప్రమాదాలు జరిగేవన్నారు. వీటిని అరికట్టేందుకు ఎల్‌సీ యాప్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎల్‌సీ తీసుకోవాలంటే సంపూర్ణ సమాచారం పొందుపరుచాల్సి ఉంటుందన్నారు. ఈ సమాచారాన్ని పరిశీలించి ఎల్‌సీ తీసుకుని పనులు చేపట్టడం ద్వారా ప్రమాదాల నివారించొచ్చన్నారు. ఇప్పటి నుంచి వరంగల్ టౌన్ డివిజన్‌లో ఎల్‌సీ యాప్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి యాప్ ద్వారానే ఎల్‌సీ తీసుకోవాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో డీఈలు ఎ.ఆనందం, ఎస్.మల్లికార్జున్, ఏడీ బి.కిశోర్, ఏఈ సి.హెచ్.సాయి కృష్ణ, సబ్ ఇంజనీర్లు సురేశ్, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.


గంజాయి ముఠా అరెస్ట్

- రూ.3.5 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు


పరకాల: సిగరెట్లలో గంజాయి పెట్టి విక్రయించాలనే ఆలోచనతో ఒడిశా నుంచి సరుకు దిగుమతి చేసి పరకాలలో విక్రయించేందుకు సిద్ధమైన ముఠాను పరకాల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పశువుల సంతలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతోపాటు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. దీంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు అనుమానితుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా రూ.3లక్షల 5వేల విలువైన 6.11 కిలోల ఎండుగంజాయి లభ్యమైంది. దీంతో ఒడిశాకు చెందిన శంకుభర సగారియా(మేస్త్రీ), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దరగోపాల్ యాదవ్(మేస్త్రీ), పరకాలలోని మల్లారెడ్డిపల్లెకు చెందిన ఓంటేరు రాజ్‌కుమార్(ల్యాబ్ టెక్నీషియన్)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శివక్రిష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు టి.సర్వర్, ఎస్.నరసింగం, డి.నాగరాజు, ఎస్.నాగరాజు, ఎ.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అటవీ జంతువును వేటాడిన వ్యక్తి అరెస్ట్


క్రిష్ణ అరెస్ట్ చూపుతున్న అధికారులు

బయ్యారం: ఉచ్చులు పెట్టి అటవీ జంతువును వేటాడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బయ్యారం డీఆర్వో ఉమారాణి గురువారం తెలిపారు. మండలంలోని గౌరారం బీట్ పరిధిలో బాలాజీపేటకు చెందిన చక్కల క్రిష్ణ బుధవారం సమీప అటవీ ప్రాంతంలో కొండగొర్రెను వేటాడారన్నారు. దీంతో అరెస్ట్ చేసి మహబూబాబాద్ కోర్టులో హాజరుపర్చామన్నారు. బీట్ ఆఫీసర్ రాంబాబు తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య


స్రవంతి మృతదేహం

చిట్యాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం బావుసింగ్‌పల్లికి చెందిన ఎర్రవెల్లి స్రవంతి (35) ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్రవెల్లి స్రవంతి, రాజేశ్వర్‌రావు దంపతులు కొంత కాలంగా హనుమకొండలో నివాసం ఉంటున్నారు. భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా స్రవంతి ఇంటి వద్దే ఉంటుంది. ఈక్రమంలో 40 రోజుల క్రితం స్రవంతికి బాబు జన్మించాడు. అయితే కొన్ని రోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతుంది. ఈ నెల 15న ఉదయం ఇంటి నుంచి వెళ్లి పోయింది. అదే రోజు ప్రకాశం బ్యారేజ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారం మేరకు గురువారం గుర్తించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

హన్మకొండ చౌరస్తా: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూలే–అంబేడ్కర్ యాదిలో–మహిళల హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం హనుమకొండకు చేరుకుంది. ఈబస్సు యాత్రకు ఐద్వా జిల్లా కమిటీ, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు వేయిస్తంభాల గుడి వద్ద బోనాలు, డప్పుచప్పుళ్లు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. వేయి స్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా సాగిన ప్రదర్శనలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వం కొనసాగుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో స్త్రీల హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. 'ఐద్వా' జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆశాలత, రత్నమాల, సాయిలీల, రామతార, శ్వేత, రాధికారాణి, అనిత, రాధ, పుష్ప, సీఐటీయూ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, చక్రపాణి, రజిత, గిరిజన సంఘం నాయకులు వీరన్న, మత్స్యకార్మిక సంఘం నాయకులు వెంకట్, కేవీపీఎస్ బాధ్యులు సాంబయ్య, సంపత్, డీవైఎఫ్ఐ బాధ్యులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.